# హిందూ పాతివ్రత్యం

తర్కాలవల్లా, వాదాలవల్లా, చర్చలవల్లా, మన దేశంలో చింతకాయలుకూడా రాలవని డాక్టరూ, శాస్త్రీ, ప్లీడరూ చర్చించుకుంటూ వుంటే వింటూ కూర్చున్నాను గోష్ఠి.

శాస్త్రికీ డాక్టరుకీ ఎప్పుడూ పడదు. వేరు వేరు వాతావరణాల్లో పెరగటంవల్ల ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చవు. డాక్టరుకి పాశ్చాత్య నాగరికత అంటే ఇష్టం. అది శాస్త్రికి మంట. ఇలా అన్నాడు:

"పాశ్చాత్య నాగరికతను పొగట్టం బానిసత్వం. ఎవరికుండే గొప్ప వారికుంది. ప్రేమ్‌చంద్ ఏమన్నాడో ఎప్పుడన్నా చదివావా?

ఇంగ్లండు వ్యాపారానికి ప్రసిద్ధి
ఫ్రాన్సు విలాసవతులకు ప్రసిద్ధి
జర్మనీ సైన్యాలకు ప్రసిద్ధి
హిందూదేశం పాతివ్రత్యానికి ప్రసిద్ధి—

'ఇదంతా తెలుసుకోకుండా వాగితే ఏం ప్రయోజనం?"

ఈ మాటలు డాక్టరుకి కొంచెం కష్టం కలిగించినై. కాని బైటపడకుండా ఇలా అన్నాడు.

"నీ మాట వొప్పుకుంటాను. కాని పాతివ్రత్యం స్త్రీ సంబంధం. అందులో వివాహమైన స్త్రీ. మనదేశంలో అంతా వివాహమైన స్త్రీలే కాదుగా! వివాహమైన స్త్రీ గొప్పతనాన్ని దేశానికి అంటగట్టుకొని మురుసుకోవటం దద్దమ్మపని. అదే మన బానిసబుద్ధిని నిరూపిస్తుంది. మిగిలినవారంతా ఎందులో గొప్పో చెప్పు?"

శాస్త్రి కేమీ తోచలేదు, అంత త్వరగా అతడాలోచించలేడు. "మనం మాత్రం పూరుకుంటున్నామా ఏమిటి? పాతివ్రత్యాన్ని కాపాడుతున్నాం." అన్నాడు.

"ఏయ్, అదేం మాట! పురుషులకు బలేపని పెట్టావే!" అన్నాడు ప్లీడరు.

డాక్టరు వూరుకోలేదు. సిగరెట్ కిటికీలోనుంచి పారవేసి శాస్త్రివైపు తిరిగి, "ఏ విధంగానో చెప్పు, బతానీలు తింటూ కూర్చునా?" అని అడిగాడు.

శాస్త్రికి కోపం వచ్చింది. నిజంగా అతనికి బతానీ లంటే ఇష్టం. అందుకని వళ్ళు మండిపోయింది. కాని డాక్టరు అతనికి అవకాశం ఇవ్వకుండా మాట్లాడేస్తున్నాడు—

"పాతివ్రత్యం మన దేశంలో పుష్కలంగా పండుతుందని చెప్పుకుందాం. కాని అది, ఒకపని చెయ్యకపోవటాన్ని తెలియజేస్తుంది. మనం ఏ పని చెయ్యటంలో గొప్పో చెప్పాలి. ఎందుకంటే కొన్నిపనులు చెయ్యటంవల్లే మానవునికి శ్రేయస్సూ,అభివృద్ధీ కలుగుతాయి. ఈ పద్ధతిని మన మెందులో గొప్పో చెప్పు?"

"పాతివ్రత్యం కాపాట్టంలో అని చెప్పేవ్ బాబూ," అంటూ ప్లీడరు శాస్త్రికి వార్నింగిచ్చాడు. "ఎందుకంటే మనం మళ్ళీ బతానీలు తినాలిసొస్తుంది."

గోపీ, డాక్టరూ పక్కున నవ్వారు.

శాస్త్రికి కోపం ఎక్కువయింది. "మీబోటి వా రుండబట్టే దేశం ఈ స్థితికి వచ్చింది..." అని మొదలు పెట్టాడు. కాని డాక్టరు అతన్ని మాట్లాడ నివ్వకుండా ఆపి, "మరి మన దేశం గొప్పదంటున్నావే!" అని ఎత్తిపొడిచాడు.

“స్త్రీల విషయంలో! స్త్రీల విషయంలో!!” అని దిద్దాడు ప్లీడరు.

ఇంతలో బైటనుంచి గోలా, కేకలూ వినిపించినై. వాదాన్ని వొదిలి నలుగురూ బయటికి పరిగెత్తారు.

రోడ్డుమీద పెద్దగుంపు పోగయింది. పక్క ఇళ్ళల్లోనుంచి స్త్రీలు ఆ వినోదాన్ని చూస్తున్నారు. ఒకరితో ఒకరు చెప్పు కుంటూ ఆనందిస్తున్నారు.

ఆ గుంపు మధ్య ఒక ముసల్దీ, దాని కూతురూ వున్నారు. ముసల్ది ఏడుస్తూవుంది. కూతురు ఆ జనంలోనుంచి తప్పించుకు పోవటానికి బిత్తరి చూపులు చూస్తూవుంది. ఇంతలో ఎక్కడి నుంచో వక జట్కా బండొచ్చింది. ఒకడు అందులో నుంచి దూకాడు. ఆ పిల్లని బలవంతంగా ఎత్తుకొని బండిలో వేశాడు. ఆమె తన్నుకుంటూ వుంటే కాళ్ళు పైకి తోసి తానూ బండె క్కాడు. బండి కదిలింది. గుర్రం పరుగెత్తింది. క్షణంలో అదృ శ్యమైంది.

తల్లి యేడుస్తూ నేవుంది – “ఇక నాకూతుర్ని బ్రతకనివ్వడు – బ్రతకనివ్వడు.” అని నెత్తినోరూ కొట్టుకుంటూనేవుంది. అంతా చూస్తూ వుండగానే ఈపని జరిగిపోయింది. ఒక్కరూ అడ్డగించ లేదు. ప్రశ్నించలేదు.

గోపీకి ఆశ్చర్యం వేసింది. అమానుషంగా కనిపించింది. ఆ గుంపులో నుంచి ఒక ముసలివాణ్ని పిలిచి అడగాడు.

“ఏమిటిది ?”

“ఆ పిల్లవాడి భార్య బాబూ, తీసుకపోయాడు.”

“దానికి బలాత్కారమెందుకూ!” అనిప్రశ్నించాడు శాస్త్రి

"ఆ అమ్మాయి రానంటుంది. అంతా ఆ తల్లిముండ చేస్తోంది బాబూ! మొగుడి దగ్గరకు పంపదు."

డాక్టరు ఈ సంభాషణ చాలా శ్రద్ధగా వింటున్నాడు. మధ్య మధ్య శాస్త్రిని కొంటెచూపులు చూస్తున్నాడు. శాస్త్రి అడిగాడు.

"తల్లికి పిల్లసుఖం కంటే ఏం కావాలి? ఎందుకు పంపనంటుంది!"

"అది దరిద్రపుముండ బాబూ. ఆ పిల్లని అడ్డం పెట్టుకొని పొట్ట పోసుకుంటూ వుంది."

"ఆ!!!" అన్నాడు శాస్త్రి ఒక తేపు తేపాడు డాక్టరు. చిటికలు వేస్తూ ఆవిలించాడు ప్లీడరు.

"అవును బాబూ. ఈ వూళ్ళో య్యాపారం పెట్టింది." అని చెప్పి వెళ్ళిపోయాడు ముసలివాడు.

"పాపం! తీసుకువెళ్ళి చంపడుగదా?" అని జాలిపడ్డాడుగోపి.

"చంపడు. పాతివ్రత్యం కాపాడుతాడు." అన్నాడు డాక్టరు. శాస్త్రికి వుక్రోషం వొచ్చింది-"ఏం చేసుకుంటే మీకేం? అది వాడిభార్య. ముద్దు పెట్టుకున్నప్పుడు ముద్దుపెట్టుకోలా? చంపుకున్నప్పుడు చంపుకుంటాడు. తనతో కాపరం చేయించుకోకుండా చూస్తూ వూరుకుంటాడా యేమిటి ?" అన్నాడు.

ఇష్టంలేని భార్యతో సుఖపడేదేమిటోయ్, వాడి పిండాకూడు ?" అన్నాడు గోపి.

"ఇష్టమేమిటి ఇష్టం ? భార్యన్నతరువాత తప్పుతుందా ఏమిటి? ఇష్టమున్నా భార్యే. ఇష్టం లేకపోయినా భార్యే. కోర్టుకూడా ఈ మాటే చెబుతుంది."

శాస్త్రి ఈ మాటలు అంటూ చూపుల్తో ప్లీడరు సహాయం కోరాడు.

ప్లీడరందుకున్నాడు. "ఔను - కోర్టూ అంతే చెబుతుంది. ప్రాణ భయమున్నట్లు నిరూపిస్తే తప్ప భార్య వేరుగా జీవించ టానికి వీల్లేదు. అలా నిరూపించటం చాలా కష్టం, ఎందు కంటే మన దేశంలో ప్రాణభయం ఒకప్పుడూ, ప్రాణం పోవ టం మరొకప్పుడూ జరగదు."

"ఐతే వాళ్ళిద్దరూ కలిసి కాపరం చెయ్యవలసిందేనా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు గోష్.

"భార్య చెయ్యవలసిందే. భర్తచేత మాత్రం ఏశాస్త్రమూ చేయించలేదు." అని జవాబు.

"భార్య ఇంట్లో పాతివ్రత్యం వండుతూవుంటే, భర్త మరో ఇంట్లో వెచ్చాలు కొంటూవుంటాడు." అన్నాడు, డాక్టరు.

"కాదు బఠానీలు!" అని దిద్దాడు ప్లీడరు.

"ఏం పాతివ్రత్యం!! ఎంత జాగ్రత్తగా కాపాడబడుతూ వుంది. మనదేశంలో? హిందూసంఘం!" అని చీదరించు కున్నాడు డాక్టరు.

హిందూసంఘ స్థితి ఇలా వుంది. కుళ్ళిపోతూవుంది. దీన్ని కప్పిపుచ్చుకొని ఆత్మవంచనతో జీవించటానికి మనం ప్రయత్ని స్తున్నాం. హిందూసంఘంలో తండ్రికీ కొడుక్కీ పట్టంలేదు. అత్తకీ కోడలికీ పట్టంలేదు. తల్లికీ కూతురికీ పట్టంలేదు. కూతు రికీ తండ్రికీపట్టంలేదు. కొడుక్కీ తల్లికీపట్టంలేదు. భార్యకీ భర్తకీ పట్టంలేదు - ఎవరికీ ఎవరికీ పట్టంలేదు. కాని వీరంతా ఒకే

యింట్లో ఒక కప్పు కింద కాపరం చెయ్యాలి. దుర్గంధం బయటకు రాకుండా కిటికీలూ తలుపులూ మూసుకొని కూర్చోవాలి.

—డాక్టరు శాస్త్రిని కొంటెగా చూచి నెమ్మదిగా కూనరాగంతో యీ విధంగా పాడాడు:

ఇంగ్లండు వ్యాపారానికి ప్రసిద్ధి
ఫ్రాంసు విలాసవతులకు ప్రసిద్ధి
జర్మనీ సైన్యాలకు ప్రసిద్ధి!
ప్రసిద్ధి!
ప్రసిద్ధి!!
ప్రసిద్ధి!!!

*